CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 41 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : నరసరావుపేట శనివారం 18 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 41 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NARASARAO PETA SAT 18 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఈ పథకంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- 'పి-4 జీరో పావర్టీ'లో పౌరులంతా భాగస్వాములు కావాలని సీఎం పిలుపు
- అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో పోస్ట్
- పేదరికం లేని రాష్ట్రమే స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యమన్న చంద్రబాబు
- 16 నెలల్లో లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వెల్లడి
- పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే నిజమైన నిర్మూలన అని స్పష్టం
- ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాల గురించి ప్రస్తావన




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పి-4 జీరో పావర్టీ' (పేదరిక నిర్మూలన) కార్యక్రమంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం 'అంత ర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. పేదరిక నిర్మూలన అంటే కేవలం పేదలకు ఆర్థిక సాయం అందించడం మాత్రమే కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు, ఎదుగుదలకు సమాన అవకాశాలు కల్పించి, అందరితో సమానంగా ముందుకు సాగేలా చేయడమే అసలైన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ప్రధాన ధ్యేయం కూడా పేదరిక నిర్మూలనేనని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకే తమ కూటమి ప్రభుత్వం తొలిరోజు నుంచే పనిచేస్తోందని తెలిపారు. గడిచిన 16 నెలల్లో తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన సంక్షేమ

వివరాలు 2లో..



## తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తాం'

- తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు ఈ-మెయిల్
- తమిళనాడు నుంచి వచ్చినట్టు గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు
- భారీగా మోహరించిన బాంబ్, డాగ్ స్క్వాడ్స్ బలగాలు
- గంటల తరబడి తనిఖీలు.. ఏమీ లభించలేదని వెల్లడి
- గత 15 రోజులుగా వరుసగా వస్తున్న బెదిరింపులు

**పెన్ పవర్ డెస్క్:**తిరుపతి కలెక్టరేట్ కు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. కలెక్టర్ కార్యాలయాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ ఓ ఆగంతుకుడి నుంచి వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్ శుక్రవారం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు అప్రమత్తమై కలెక్టరేట్ ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి.

**తమిళనాడు నుంచి బెదిరింపు**

గురువారం రాత్రి 10 గంటల సమయంలో కలెక్టరేట్ అధికారిక మెయిల్‌కు ఈ బెదిరింపు సందేశం వచ్చింది. "కలెక్టరేట్‌ను బాంబులతో పూర్తిగా పేల్చేస్తాము.

వివరాలు 2లో..

## నటుడు విజయ్ టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు

- కరూర్ తొక్కిసలాట ఘటనలో 41 మంది మృతి
- టీవీకే పార్టీ గుర్తింపు రద్దు చేయాలని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు
- గుర్తింపు లేనందున హోదా రద్దు అభ్యర్థన నిలబడదని కోర్టుకు తెలిపిన ఈసీ




**పెన్ పవర్ డెస్క్:**తమిళ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టు ధర్మాసనానికి నివేదించింది. కరూర్‌లో విజయ్ ప్రచార

వివరాలు 2లో..

## పరకామణి చోరీ కేసు: టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

- తిరుమల పరకామణి చోరీ కేసుపై హైకోర్టులో విచారణ
- కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఈవోపై ఆగ్రహం
- ఈ నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఈవోకు ఆదేశం




తిరుమల పరకామణిలో జరిగిన భారీ చోరీ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది.

వివరాలు 2లో..

## అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి

### ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులపై కర్ణాటక సీఎం



- కర్ణాటకలో సామాజిక, ఆర్థిక సర్వేపై నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతున్నారని వ్యాఖ్య
- రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై ఆ దంపతులకు కొన్ని అపోహలు ఉన్నాయన్న సిద్ధరామయ్య
- నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లు ఇది వెనుకబడిన వర్గాల సర్వే కాదన్న ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**కర్ణాటకలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతే తానేమీ చేయలేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై

వివరాలు 2లో..


## ఏపీ ఐపీఎస్ అధికారి సంజయ్‌ కస్టడీ పొడిగింపు

- సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు
- అక్టోబర్ 31 వరకు రిమాండ్ విధించిన ఏసీబీ ప్రత్యేక కోర్టు
- ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో తీవ్ర ఆరోపణలు
- గతంలోనే సంజయ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం
- వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సంజయ్
- టెండర్ల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలు




వివరాలు 2లో..

## నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలు.. కానీ సీఎం అభ్యర్థిపై మెలిక పెట్టిన అమిత్ షా!



- బీహార్ ఎన్డీయేలో విభేదాలు లేవన్న కేంద్రమంత్రి అమిత్ షా
- నితీశ్ కుమార్ నాయకత్వంలోనే ఎన్నికల బరిలోకి దిగుతామని స్పష్టీకరణ
- ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికల తర్వాతే నిర్ణయిస్తామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటున్న తరుణంలో, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో నితీశ్ కుమార్ నాయకత్వంలోనే కూటమి పోటీ చేస్తుందని స్పష్టం చేసిన ఆయన, ఎన్నికల తర్వాతే ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పి రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించారు.

వివరాలు 2లో..

## ఏపీకి వర్ష సూచన... మూడు జిల్లాలకు అలర్ట్

- చురుగ్గా కదులుతున్న ఈశాన్య రుతుపవనాలు
- నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్ష సూచన
- పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం
- హెచ్చరికలు జారీ చేసిన విపత్తుల నిర్వహణ సంస్థ
- మరో 13 జిల్లాల్లో మోస్తరు వర్షాల అంచనా
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



**పెన్ పవర్ డెస్క్:**ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా మూడు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, శనివారం నాడు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వర్షాలు పిడుగులతో కూడి ఉండే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో చెట్లు, భారీ హోర్డింగులు, విద్యుత్ స్తంభాల కింద నిలబడటం సురక్షితం కాదని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

- ప్రధాని మోదీపై ఎక్స్‌లో వైఎస్ షర్మిల విమర్శలు
- కర్నూలులో మోదీ దీపావళి టపాసు తుస్సుమందన్న షర్మిల
- ఏపీకి వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషమంటూ ఎద్దేవా



**పెన్ పవర్ డెస్క్:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని పర్యటన ఒక "తుస్సుమన్న దీపావళి టపాసు"లాంటిదని ఆమె ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషం కట్టారని, శ్రీశైలం మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలకు తెరలేపారని

వివరాలు 2లో..

## మావోయిస్టు ఉద్యమానికి పెను దెబ్బ: ఒకేసారి 200 మంది లొంగుబాటు

- బస్తర్‌లో లొంగిపోనున్న మావోయిస్టులు
- సీఎం విష్ణు దేవ్ సాయి సమక్షంలో లొంగుబాటు కార్యక్రమం
- మావోయిస్టు ఉద్యమానికి తగిలిన అతిపెద్ద ఎదురుదెబ్బ
- ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం విజయవంతం
- రెండు రోజుల్లోనే 258 మంది మావోల లొంగుబాటు



**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి అతిపెద్ద ఎదురుదెబ్బ తగిలింది. దండకారణ్యం ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకులు సహా సుమారు 200 మంది

వివరాలు 2లో..



## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

- జలమార్గాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సోనోవాల్ వ్యాసం షేర్ చేసిన ప్రధాని మోదీ
- 2014లో 5గా ఉన్న జాతీయ జలమార్గాలు ఇప్పుడు 111కి పెంపు
- పదేళ్లలో 18 నుంచి 145 మిలియన్ టన్నులకు చేరిన సరకు రవాణా
- రివర్ టూరిజంలోనూ భారీ వృద్ధి... 25 క్రూయిజ్ నౌకలు ఏర్పాటు
- వికసిత్ భారత్ లక్ష్యంలో జలమార్గాలే కీలకమన్న కేంద్రం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# లోకేష్ మార్క్ ఎకోసిస్టమ్

ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే అతి పెద్ద డేటా సెంటర్ రావడం సంచలనంగా మారింది. ఇష్టం లేని వాళ్లు అదో నిరర్థక పెట్టుబడి అంటున్నారు. భారీ రాయితీలు ఇచ్చారని అంటున్నారు. ఎవరి వాదన వారు చెబుతున్నారు. కానీ ఆ పెట్టుబడి ఎంత ముఖ్యమైనదో.. ఇండస్ట్రీ గుర్తించింది. అందుకే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ను వారు చూస్తున్నారు. ఏపీలో వేగంగా సాగుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణాలు, ఎకో సిస్టమ్ ఏర్పాటు వంటివి ముందు ముందు పెట్టుబడుల వెల్లువకు కారణం కాబోతున్నాయని ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో స్పష్టత ఉంది.ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పారిశ్రామిక వర్గాలకు మొదటి చాయిస్ గా మారింది. ఏపీ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. నిజానికి ఏపీకి రావాల్సిన అవసరం ఏ పారిశ్రామిక సంస్థకూ లేదు. ఎందుకంటే ఏపీకి మూడు వైపులా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ఉన్నాయి. ఆ నగరాలు ఉన్న మూడురాష్ట్రాలు పారిశ్రామికంగా ఎంతో ముందు ఉన్నాయి. వాటి వైపు వెళ్లకుండా.. ఏపీకి పరిశ్రమల్ని తీసుకురాగలగడం చిన్న విషయం కాదు. కానీ పదహారు నెలల్లోనే అలాంటి సమస్యల్ని పరిష్కరించి ఏపీ పారిశ్రామిక వర్గాలను ఆకట్టుకుంటోంది.ఏపీతో చర్చలు జరిపేందుకు పెద్ద ఎత్తున పారిశ్రామికవర్గాలు ఆసక్తి చూపిస్తున్నాయి. గతంలో చర్చలు జరిపిన ఫాక్స్ కాన్ వంటి సంస్థలు ఇప్పుడు తమ పెట్టుబడుల ప్రణాళికల్ని వేగవంతం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. గూగుల్ డేటా సెంటర్ కారణంగా అక్కడ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు పెద్ద ఎత్తున ఇతర సంస్థలూ ముందుకు వస్తున్నాయి. కాగ్నిజెంట్ , యాక్సెంచర్ లాంటివే కాదు.. మధ్యస్థ ఐటీ కంపెనీలు కూడా పెద్ద ఎత్తున తమ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నాయి.విశాఖలో నవంబర్‌లో జరగనున్న పెట్టుబడుల సదస్సులో పాల్గొనే .. ప్రపంచప్రసిద్ధ పారిశ్రామిక వేత్తల సంఖ్య గూగుల్ పెట్టుబడి కారణంగా పెరిగే అవకాశం ఉంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా సీఐఐ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సు రాష్ట్ర పెట్టుబడుల చరిత్రను తిరిగరాసే అవకాశం ఉంది. అందు కోసం చాలా కాలం నుంచే ప్రభుత్వం కసరత్తు చేస్తోందిఐదు సంవత్సరాల్లో ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా నారా లోకేష్ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ఎంవోయూలు చేసుకుని టైంపాస్ చేయాలని ఆయన అనుకోవడం లేదు. నేరుగా ఎగ్జిక్యూషన్ కే ప్రాధాన్యం ఇస్తున్నారు. పనులు ప్రారంభించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. అందుకే.. పెట్టుబడులు గ్రౌండింగ్ కోసం ఎదురు చూడాల్సిన పనిలేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోకేష్ మార్క్ ఎకోసిస్టమ్ ఏపీని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చనుంది.

# భారతదేశ పురోగతికి నదులే రహదారులు

భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు."వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మార్పు వల్ల తక్కువ ఇంధన వినియోగం, తక్కువ కాలుష్యం, చౌకైన రవాణా వంటి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.జలమార్గాల ద్వారా సరకు రవాణాలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. 2013-14లో కేవలం 18 మిలియన్ టన్నులుగా ఉన్న సరకు రవాణా, 2024-25 నాటికి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2030 నాటికి 200 మిలియన్ టన్నులు, 2047 నాటికి 250 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు.

అదే సమయంలో నదీ పర్యాటకం (రివర్ టూరిజం) కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని సోనోవాల్ అన్నారు. దశాబ్దం క్రితం కేవలం 5 క్రూయిజ్ నౌకలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 13 జలమార్గాల్లో 25 క్రూయిజ్ నౌకలు సేవలందిస్తున్నాయని చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, కేరళ బ్యాక్‌వాటర్స్ ఈ రంగంలో ముందున్నాయని, వారణాసి, కోల్‌కతా, పాట్నా, గౌహతి వంటి టెర్మినళ్లను ఆధునికీకరిస్తున్నామని ఆయన తన వ్యాసంలో పేర్కొన్నారు.

# ఏపీ ఐపీఎస్ అధికారి సంజయ్ కస్టడీ పొడిగింపు

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్. సంజయ్‌కు ఏసీబీ ప్రత్యేక కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆయన జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం అక్టోబర్ 31 వరకు పొడిగించింది. శుక్రవారం కస్టడీ గడువు ముగియడంతో ఏసీబీ అధికారులు సంజయ్‌ను కోర్టు ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ఆయన రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. కాగా, ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు అక్టోబర్ 13న తిరస్కరించిన విషయం తెలిసిందే.1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సంజయ్, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల డీజీగా, సీఐడీ అదనపు డీజీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023లో అగ్నిమాపక శాఖ కోసం 'అగ్ని-ఎన్ఓసీ' వెబ్ పోర్టల్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టును ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించడంలో టెండర్ల నిబంధనలను ఉల్లంఘించారని ఆయనపై ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. టెండర్లు పిలవకుండానే కొన్ని పరికరాలను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇచ్చారని ఏసీబీ కేసు నమోదు చేసింది. ప్రైవేట్ కంపెనీలకు చెల్లింపులు, ప్రాజెక్టుల అమలులో జరిగిన అవకతవకలపైనా ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

ఈ కేసులో తొలుత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పును తప్పుబట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన ఆగస్టు 26న ఏసీబీ కోర్టులో లొంగిపోయారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా ఉన్న సంజయ్, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై నమోదైన స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసుల దర్యాప్తును పర్యవేక్షించారు. ఆ కేసుల్లో చంద్రబాబు అరెస్ట్ అయి సుమారు రెండు నెలల పాటు జైలులో ఉన్నారు. 2024 జూన్‌లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత, సంజయ్‌ను బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయనపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం సంజయ్‌ను సస్పెండ్ చేయగా, ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తోంది.

## తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తాం'

- మొదటి పేజి తరువాయి

సిద్ధంగా ఉండండి" అని అందులో హెచ్చరించారు. అధికారులు వెంటనే దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ మెయిల్ తమిళనాడు ఐపీ అడ్రస్ నుంచి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

**గంటలపాటు క్షుణ్ణంగా తనిఖీలు**

ఈ మెయిల్ సమాచారం అందిన వెంటనే, తిరుపతి పోలీస్ కమిషనర్ డాక్టర్ వి. సురేష్ కుమార్, ఎస్పీ కె. రమణ ఆధ్వర్యంలో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. కలెక్టర్ ఛాంబర్, జాయింట్ కలెక్టర్ కార్యాలయం, ఇతర శాఖల గదులు, పార్కింగ్ ప్రాంతంతో పాటు సమీపంలోని భవనాలను కూడా గంటల తరబడి జల్లెడ పట్టాయి. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభించకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.గత 15 రోజులుగా తిరుపతి కలెక్టరేట్‌కు ఇలాంటి బెదిరింపు మెయిల్స్ వస్తూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో సాధారణ హెచ్చరికలతో మెయిల్స్ రాగా, ఈసారి నేరుగా పేల్చివేస్తామని బెదిరించడంతో అధికారులు దీన్ని మరింత తీవ్రంగా పరిగణిస్తున్నారు.

ఈ ఘటనపై కలెక్టర్ డాక్టర్ ప్రారంభ్ దాస్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పోలీసులతో కలిసి దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, "ఇలాంటి మెయిల్స్ పంపడం చట్టవిరుద్ధం. దీని వెనుక ఉన్న వారిని తప్పకుండా పట్టుకుంటాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు.

## ఏపీకి వర్ష సూచన... మూడు జిల్లాలకు అలర్ట్

- మొదటి పేజి తరువాయి

రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు పొలాల్లో ఉండవద్దని ప్రత్యేకంగా సూచించారు.ఇదే సమయంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఈ ప్రాంతాల్లో కూడా పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ప్రజలు వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది.

## ఈ పథకంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- మొదటి పేజి తరువాయి

, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతినెలా రూ. 2,758 కోట్లతో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 207 'అన్నా క్యాంటీన్లను' పునఃప్రారంభించి, కేవలం రూ. 5కే పేదల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. 'దీపం 2.0' పథకం ద్వారా పేద మహిళలకు ఏడాదికి 3 వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.పేద కుటుంబాల పిల్లలు చదువులో రాణించాలనే ఉద్దేశంతో, ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ 'తల్లికి వందనం' కింద ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. 'స్త్రీ శక్తి' పథకంతో మహిళలందరికీ

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అదేవిధంగా, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు తొలి విడతగా రూ. 7,000 జమ చేశామని, మత్స్యకారులకు రూ. 246 కోట్లు, ఆటో డ్రైవర్లకు రూ. 435 కోట్లు అందించామని ఆయన తన పోస్ట్‌లో వివరించారు.

## పరకామణి చోరీ కేసు: టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యవహారంలో ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) వ్యక్తిగతంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది.శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా, టీటీడీ అధికారుల తీరుపై న్యాయమూర్తి అసహనం ప్రదర్శించారు. కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యంపై ప్రశ్నించారు. ఈ నెల 27న జరిగే తదుపరి విచారణకు ఈవో కచ్చితంగా హాజరుకావాలని, లేనిపక్షంలో రూ. 20 వేల జరిమానా విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని టీటీడీ తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు ఈ విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు, ఇప్పటికే తిరుమల పరకామణిలోని కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తునకు సంబంధించిన ప్రాథమిక నివేదికను, సీజ్ చేసిన ఫైళ్లను శుక్రవారం కోర్టుకు సమర్పించారు.గతంలో రవికుమార్ అనే ఉద్యోగి పరకామణిలో భారీగా అవకతవకలకు పాల్పడినట్లు 2023లో ఆరోపణలు వచ్చాయి. అయితే, అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ అధికారులు ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపకుండా లోకాయుక్త ద్వారా రాజీ కుదిర్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో న్యాయస్థానం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతోంది.

## నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలు.. కానీ సీఎం అభ్యర్థిపై మెలిక పెట్టిన అమిత్ షా!

- మొదటి పేజి తరువాయి

బీహార్‌లోని అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై విభేదాలు తలెత్తాయని, పార్టీల మధ్య మనస్పర్థలు వచ్చాయని మీడియాలో వస్తున్న వార్తలపై అమిత్ షా స్పందించారు. అవన్నీ నిరాధారమైన కథనాలని, వాటిలో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేశారు. కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అన్ని మిత్రపక్షాలు ఐక్యంగానే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభ్యర్థి గురించి అమిత్ షా మాట్లాడుతూ, "నితీశ్ కుమార్ సీఎం అవుతారా? లేదా? అని నిర్ణయించేది నేను కాదు. ప్రస్తుతానికి ఆయన నాయకత్వంలోనే మేము ఎన్నికలకు వెళుతున్నాం. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ, దాని మిత్రపక్షాలన్నీ కలిసి కూర్చొని తమ నాయకుడిని ఎన్నుకుంటాయి" అని వివరించారు. ఈ వ్యాఖ్యలతో సీఎం అభ్యర్థిపై ఒకరకమైన సస్పెన్స్‌ను కొనసాగించారు.

2020 ఎన్నికల నాటి పరిస్థితులను ఆయన గుర్తుచేశారు. "గత ఎన్నికల్లో జేడీయూ కన్నా బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుచుకుంది. ఆ సమయంలో నితీశ్ కుమార్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి, బీజేపీ నుంచే ముఖ్యమంత్రి ఉండాలని ప్రతిపాదించారు. కానీ, మేము మిత్రపక్షానికి, సీనియారిటీకి ఎప్పుడూ గౌరవం ఇస్తాం. అందుకే నితీశ్‌ను సీఎం చేశాం" అని అమిత్ షా తెలిపారు.

కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. నవంబర్ 6న తొలి దశ, నవంబర్ 11న రెండో దశ పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి ఘన విజయం సాధిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆ దంపతులకు కొన్ని అపోహలున్నాయని, ఇది వెనుకబడిన వర్గాల సర్వే అనే అభిప్రాయంతో వారు ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు తిరస్కరిస్తూ, తమది వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబం కాదని, ఈ సమీక్షలో పాల్గొనడం వల్ల కమిషన్‌కు లేదా ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని అన్నారు. దీనిపై సిద్ధరామయ్య స్పందించారు.ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లుగా ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఇది ఏడు కోట్ల జనాభా సర్వే అని ఇప్పటికి ఇరవై సార్లు చెప్పామని అన్నారు. వారు ఏది కావాలంటే అది రాసుకోనివ్వండని, ఈ సర్వే దేని గురించో ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోకుంటే తానేం చేయగలనని ఆయన ప్రశ్నించారు.రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు నెలకు రూ. 2 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఈ పథకాల్లో అగ్రవర్ణ మహిళలు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న మహిళలులేరా అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. ఈ సర్వేపై పలుమార్లు ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చినప్పటికీ వారి అపోహలు తొలగిపోలేదని ఆయన అన్నారు. కేంద్రం ఇప్పుడు కులగణనతో ముందుకు వస్తుందని, దీనిపై నారాయణమూర్తి దంపతులు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు.

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

- మొదటి పేజి తరువాయి

ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మరోసారి ఘరానా మోసం చేశారంటూ మండిపడ్డారు.శ్రీశైలం క్షేత్ర అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని షర్మిల విమర్శించారు. "మల్లన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? రూ. 1,657 కోట్లతో పెండింగ్‌లో ఉన్న మాస్టర్ ప్లాన్ మీకు కనిపించలేదా?" అని ఆమె ప్రశ్నించారు. ఉజ్జయిని, వారణాసి కారిడార్ల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ శ్రీశైలం మల్లన్న కారిడార్‌పై ఎందుకు లేదని నిలదీశారు. శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని, ఇది మల్లన్నకు చేస్తున్న ద్రోహం కాదా? అని అన్నారు.

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై కూడా షర్మిల పలు ప్రశ్నలు లేవనెత్తారు. 11 ఏళ్ల క్రితం తిరుపతిలో చెప్పిన పాత పిట్టకథనే ప్రధాని మళ్లీ చెప్పారని విమర్శించారు. ఢిల్లీకి, రాష్ట్ర రాజధానికి లింక్ పెట్టారని, కానీ అరకొర అప్పులు ఇస్తే అమరావతి ఢిల్లీతో

ఎలా పోటీ పడుతుందని ప్రశ్నించారు. కేవలం అప్పులకు హామీలు ఇచ్చినంత మాత్రాన రాష్ట్రం ప్రగతి పథంలో పరుగులు పెడుతుందా? అని నిలదీశారు. రాజధానికి లక్ష కోట్ల అప్పులు తెస్తే రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారుతుందని, ప్రగతి ద్వారాలు ఎలా తెరుచుకుంటాయని ఆమె అన్నారు.

## మావోయిస్టు ఉద్యమానికి పెను దెబ్బ: ఒకేసారి 200 మంది లొంగుబాటు

- మొదటి పేజి తరువాయి

మావోయిస్టులు శుక్రవారం ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలవనున్నారు. బస్తర్‌లో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి సమక్షంలో ఈ చారిత్రాత్మక లొంగుబాటు కార్యక్రమం జరగనుంది. కొన్నేళ్లుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పెనుసవాలుగా మారిన మావోయిస్టు ఉద్యమాన్ని ఈ ఘటన తీవ్రంగా దెబ్బతీసింది.ప్రభుత్వ విధానాలు, భద్రతా బలగాల కృషితోనే ఇది సాధ్యమైందని బస్తర్ ఐజీ పి. సుందర్‌రాజ్ తెలిపారు. మావోయిస్టు ఉద్యమాన్ని బలహీనపరచడంలో తాము సఫలమవుతున్నామని చెప్పడానికి ఈ భారీ లొంగుబాటే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. హింసను వీడి వచ్చే మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధానం సత్ఫలితాలనిస్తోంది. ఈ విధానం కింద లొంగిపోయిన వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వారు తిరిగి సమాజంలో గౌరవంగా బతికేందుకు అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందిస్తోంది.

గత కొద్ది రోజులుగా మావోయిస్టుల లొంగుబాట్లు గణనీయంగా పెరిగాయి. కేవలం ఒక్క రోజు క్రితమే టాప్ కమాండర్ రూపేశ్‌తో సహా 170 మంది లొంగిపోయారు. అంతకుముందు, అక్టోబర్ 15న సుక్మా జిల్లాలో రూ.50 లక్షల సమష్టి బహుమతి ఉన్న 27 మంది మావోయిస్టులు ఆయుధాలు అప్పగించారు. గత రెండు రోజుల్లో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 258 మంది లొంగిపోయినట్లు తెలుస్తోంది.మరోవైపు,

2026 మార్చి 31 నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరాలని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన మావోయిస్టులకు పిలుపునిచ్చారు. ఉద్యమంలోని అంతర్గత విభేదాలు, స్థానిక ప్రజల నుంచి మద్దతు కరువవడం వంటి కారణాలతో మావోయిస్టులు లొంగుబాటుకు మొగ్గుచూపుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నటుడు విజయ్ టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు

- మొదటి పేజి తరువాయి

సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ గుర్తింపును రద్దు చేయడంతో పాటు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో మహిళలు, చిన్నారులు పాల్గొనకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.వీటిని సీజే జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌ల ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ కోర్టులో వాదనలు వినిపించారు. టీవీకే పార్టీకి గుర్తింపు లేనందున ఆ పార్టీకి ఆ హోదా రద్దు చేయాలనే అభ్యర్థన నిలబడదని కోర్టుకు తెలిపారు.మరోవైపు, కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు మినహా ఈ కేసుల విచారణకు ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా వాటన్నింటినీ హైకోర్టు పాలనా వ్యవహారాల విభాగం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై జరిగిన

# దాడి అమానుషం

**అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నల్ల జెండాలతో ర్యాలీ**

**బాధితులను తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్**







**పెన్ పవర్ కారంపూడి అక్టోబర్ 17**

సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ బిఆర్ గావాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కారంపూడి మండల ఎం ఆర్ పి ఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మాచర్ల రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు ఎం ఆర్ పి ఎస్ నాయకులు నల్ల జెండాలతో నిరసన తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎం ఆర్ పి ఎస్ అధ్యక్షులు తాళ్లూరి. జీవరత్నమాదిగ మాట్లాడుతూ భారతదేశ సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గావాయి పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని అయన డిమాండ్ చేశారు. ఈ సంఘటన వెనక ఎవరెవరు ఉన్నారో వారిని గుర్తించి తగిన శిక్షపడేలా కేంద్ర ప్రభుత్వం చొరవచూపాలని అయన అన్నారు. భారతదేశ సర్వోన్నత ప్రధాన న్యాయమూర్తి పైనే దాడులు జరుగుతుంటే ఇక సామాన్యప్రజల పరిస్థితి ఏంటి అని ఈ ఘటన పై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంఘటనకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలని ఎం ఆర్ పి ఎస్ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు జీవరత్న అన్నారు. న్యాయదేవత గర్భగుడిలో ఇలాంటి దాడి జరగడం బాధాకరమైన విషయమని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అయన కోరారు. డిప్యూటీ తహసిల్దార్ విద్యాసాగర్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో కారంపూడి మండల ఎంఎస్పి అధ్యక్షులు కడియం. మరియదాసు మాదిగ, అధికార ప్రతినిధి కోట. దాసు, ప్రధాన కార్యదర్శి తాళ్లపోగు. చంటి, ఎం ఆర్ పి ఎస్, ఎంఎస్పి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## గుంటూరు । బాపట్ల । పల్నాడు

# దమ్మున్న నాయకుడు అభివృద్ధి చేయగలిగిన నాయకుడు....

**బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య..**

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 17.**

వైజాగ్ నుంచి పరిపాలన చేయాలని ఆలోచనతో గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేస్తే ప్రజలు నాయకులు ఎవ్వరు అంగీకరించలేదు ఈరోజు దమ్మున్న నాయకులు అభివృద్ధి చేయగలిగిన నాయకుడు మాట చెబితే తిరుగులేదు అడ్డు చెప్పిన వారు ఎవరు లేరు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైజాగే రాజధాని అని ఎంతగా పంతం పట్టినా వైజాగ్ వైపు ఇన్వెస్టర్స్ ఎవరూ చూడలేదు, కానీ మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి నే రాజధాని అని చెప్పినా గూగుల్, కాగ్నిజెంట్ లాంటి ఇంటర్నేషనల్ కంపెనీలు వైజాగ్ లో లక్షల కోట్లు ఇన్వెస్ట్ చెయ్యడానికి ఆసక్తి చూపిస్తున్నారు.ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యాలంటే వాటికి న్యాయ, శాసన, పరిపాలన రాజధానులు అని పేరు పెట్టాల్సిన పని లేదు. అవన్నీ మంగళవారం మాటలు అని గత పాలనలో తేలిపోయాయి. ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యాలంటే సరైన లీడర్షిప్ తో, ప్రాపర్ ప్లానింగ్ తో ఆ ప్రాంతంలో ఉన్న వనరులను సరిగా ప్రమోట్ చేసుకుంటే చాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ది అదే చేస్తున్నారు.లక్షల కోట్లు రాబడుతున్నారు. సముద్రం చూసి జగనన్న చేపలు పట్టుకుని అమ్ముకోవడానికి ఫిష్ ఆంధ్రా దుకాణాలు ఏర్పాటు చేశాడు. కానీ అదే సముద్రాన్ని మన చంద్రబాబు నాయుడు డేటా సెంటర్లు ఏర్పాటు చేసి వివిధ దేశాలకు డేటా కేబుల్ నెట్వర్క్ విస్తరించేలా ప్రణాళిక చేశారు.ఎవరి స్థాయి సామర్థ్యం ఏంటి అనేది ఈ ఒక్క ఉదాహరణతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు మేధావులు అందరూ అర్థం చేసుకోవచ్చు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.



# వసతి గృహ భవనాల ముఖ చిత్రం మారాలి...

**కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా..**



**పెన్ పవర్ గుంటూరు, అక్టోబరు 17**

ప్రభుత్వ భవనాలలో నడుస్తున్న సంక్షేమ వసతి గృహాల ముఖ చిత్రాలు మారాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. వివిధ ఇంజనీరింగ్, సంక్షేమ శాఖలతో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. వసతి గృహాల భవనాలు సుందరంగా, ఆహ్లాదకరంగా మారాలని తద్వారా అందులో ఉంటున్న విద్యార్థుల మానసిక స్థితిలో మార్పు వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పరిసరాల ప్రభావం వారి ఆలోచనలు ఉన్నతంగా మార్చుటకు దోహదం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ భవనాల్లో ఉన్న 20 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, 8 బిసి సంక్షేమ వసతి గృహాలు, 3 గిరిజన సంక్షేమ వసతి గృహాలుతో సహా అంగన్వాడీ కేంద్రాలలో అవసరమగు మౌలిక సదుపాయాలు గుర్తించాలని ఇ.డబ్ల్యూ.ఐ.డి.సి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి అవసరాన్ని గుర్తించి జాబితా తయారు చేయాలని, తగిన అంచనాలు తయారు చేయాలని అన్నారు. ప్రతి వసతి గృహం రూపురేఖలు మారాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన పరిసరాలు, రక్షిత తాగునీరు, ఆహ్లాదకర వాతావరణం అందాలని వివరించారు. విద్యార్థుల ఆరోగ్యానికి, వారిలో సృజనాత్మకత పెరుగుటకు ప్రతి అంశం దోహదం కావాలని పేర్కొన్నారు. రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. గృహ నిర్మాణంలో స్లాబ్ వేయుటకు సిద్ధంగా ఉన్నవాటిని పూర్తి చేయుటకు తక్షణ చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ అమృత్ పథకం కింద ఏడు ప్రాజెక్ట్ లకు రూ.331 కోట్లు మంజూరు అయ్యిందన్నారు. తక్కెళ్ళపాడు నుండి బుడంపాడు వరకు పైపు లైన్లు వేసి ఏటుకూరు గ్రామం వద్ద ఐదు లే అవుట్లకు నీరు ఇచ్చుటకు పనులు చేపడుతున్నామని వివరించారు. గోరంట్ల వద్ద రిజర్వాయర్ పూర్తి చేయడం ద్వారా చుట్టు ప్రక్కల గ్రామాలకు కూడా నీరు అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రహదారులు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ మంగళగిరి – తాడికొండ రహదారి నిర్మాణంలో నిడమర్రు వద్ద ఆక్రమణలు తొలగించాల్సి ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ రహదారులు సంస్థ అధికారి మాట్లాడుతూ విజయవాడ బై పాస్ రహదారితో పాటు ఇతర ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. కొండవీటి కోట, చినకాకాని వద్ద పనులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఈ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పనులను 12 ప్యాకేజీల్లో చేపట్టుట జరుగుతుందని, 2029 నాటికి పూర్తి చేయాలని కార్యాచరణ ఉందన్నారు. టిడ్కో పర్యవేక్షక ఇంజనీర్ ఉమా శంకర శాస్త్రి మాట్లాడుతూ టిడ్కో కాలనీలలో మురుగు నీటి శుద్ధి పనులు పూర్తి అయ్యాయన్నారు. వెంగళరాయ పాలెంలో మౌళిక వసతుల కల్పన జరుగుతోందన్నారు. గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ దీపావళి తరువాత గృహ ప్రవేశాలు చేయుటకు చర్యలు చేపట్టామన్నారు. ప్రత్తిపాడు మండలం కొత్తూరు, చేబ్రోలు మండలం సెలపాడు తదితర లే అవుట్లు ఎంపిక చేస్తున్నామని చెప్పారు. మన బడి – మన భవిష్యత్తు కార్యక్రమంలో 223 పనులు పూర్తి చేశామని, పి.యం.శ్రీ క్రింద 71 పనులు పూర్తి చేశామని, 10 పనులు పూర్తి అయ్యే దశలో ఉన్నాయని సర్వ శిక్షా అభియాన్ కార్యనిర్వహక ఇంజనీర్ రవీంద్ర తెలిపారు. చిన కాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటిజం కేంద్రాన్ని తయారు చేస్తున్నామని చెప్పారు. నగర పాలక సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ సుందరరామి రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, ఎం.ఎస్.ఐ.డి.సి తదితర శాఖల అధికారులు హాజరై తమ శాఖల పరిధిలో చేపడుతున్న పనుల వివరాలను తెలిపారు.

# హత్య కేసులో నేరస్థునికి జీవిత ఖైదు

**- 8 వేల రూపాయల జరిమానా - తీర్పు వెలువరించిన ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఏ. భారతీ**

**- నేరస్థుడికి జైలు శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్**

**పెన్ పవర్, అక్టోబర్ 17, అద్దంకి :**

నేరస్థులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లుంటుందని జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని సంతమాగులూరు పోలీస్ స్టేషన్ మండల కేంద్రమైన సంతమాగులూరు ఎస్.టి కాలనీలో 2021 సంవత్సరం డిసెంబర్ 31న రావూరి వెంకట నారాయణ (33 ) తన భార్యను అతి కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పటి పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఏ. భారతీ సదరు కేసులోని నిందితుడికి జీవిత ఖైదు మరియు 8 వేల రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. సంతమాగులూరు సిఐ వెంకట్రావు తెలిపిన కేసు వివరాలు ప్రకారం సంతమాగులూరు గ్రామం, కాలనీకి చెందిన రావూరి వెంకట నారాయణ (ముద్దాయి) కి గతంలో ఈర్ల అంకమ్మతో వివాహం జరిగింది. తర్వాత అతని భార్య అతనిని వదిలి వెళ్లిపోయింది. అదే విధంగా మృతురాలు రావూరి మరియమ్మకీ (31) మొదట వివాహం అయినది. ఆమె కూడా భర్తతో విడిపోయింది. ఈ సంఘటనకు ముందు 3 సంవత్సరాల క్రితం మరియమ్మ కు రావూరి వెంకట నారాయణతో మళ్లీ వివాహం జరిగింది. అయితే మరియమ్మ మరెవరితోనో అక్రమ సంబంధం సాగిస్తుందన్న అనుమానం పెంచుకొని, తరచూ నారాయణ గొడవ పడుతూ ఉండేవాడు. భార్య మరియమను పద్ధతి మార్చుకోనక పోతే చంపేస్తానని బెదిరిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో 31.12.2021 రాత్రి 8 గంటల సమయంలో ముద్దాయి రావూరి వెంకట నారాయణ ఇంటికి వచ్చే సమయానికి తన భార్య మరియమ్మ ఇంట్లో లేకపోవడంతో ఆమెపై ఎక్కువ అనుమానం పెంచుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత మరియమ్మ ఇంటికి వచ్చేసరికి ముద్దాయి ఆమెతో గొడవపడి, నీవు ఇక మారవు అని, ఆమెను చంపాలనే ఉద్దేశంతో ఇంట్లో ఉన్న సుబాబుల్ కర్ర నరికే కత్తి తీసుకొని ఆమెపై దాడి చేయగా, ఆమె తప్పించుకొని పారిపోయే క్రమంలో ఇంటి ముందు పడిపోగా, ఆమెపై కత్తితో పాశవికంగా దాడి చేసి హతమార్చాడు. శవాన్ని కనిపించకుండా చేసేందుకు, ఆమె శవాన్ని భుజాన వేసుకొని, గ్రామ సమీపంలోని మల్లారెడ్డి పొలం వద్ద గల పంట కాలువలో పడవేశాడు. గ్రామంలోని చలంచర్ల చలమయ్య ఇంటి వద్దకు రాగా, అక్కడ నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న ముద్దాయి వెంకటరమణ అల్లుడు రాచూరి ప్రసన్న మరియు మరికొంత మంది వెంకటరమణ ప్రవర్తనలో మార్పు గమనించి గట్టిగా ప్రశ్నించగా, అతడు తన భార్యను హత్య చేసిన విషయం తెలిపి, అక్కడకు తీసుకెళ్లి శవాన్ని చూపించి అక్కడినుండి పారిపోయాడు. మృతురాలి అల్లుడు రాచూరి ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సంతమాగులూరు ఎస్ఐ జి. శివన్నారాయణరావు క్రైమ్ నంబరు 01/ 2022 %ఏ/రీ% 302, 201 ఐపీసీ గా కేసు నమోదు చేశారు. అప్పటి అద్దంకి సీఐ ఎమ్. రాజేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి, సమగ్రంగా కేసు దర్యాప్తు పూర్తి చేసి ముద్దాయిపై సంబంధిత న్యాయ స్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో కేసు విచారణకు రాగ, బాపట్ల జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పర్య వేక్షణలో సంతమాగులూరు సీఐ కె. వెంకటరావు, ఎస్ఐ ఎమ్. పట్టాభి రామయ్య, ఒంగోలు జిల్లా కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ వి. రాఘవ రావు, సంతమాగులూరు కోర్టు కానిస్టేబుల్ కె. శ్రీను లు సాక్షులను సరైన రీతిలో, నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి, సరైన సమయంలో కోర్టుకు హాజరు పరచగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. వసుంధర మరియు వై. ప్రశాంత కుమారి కోర్టులో వాదోపవాదాలు వినిపించి, నిందితుడిపై మోపబడిన నేరాన్ని తగిన సాక్షాదారాలతో నిరూపించగా, ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఏ. భారతీ నిందితుడు రావూరి వెంకట నారాయణ ఊరఫ్ నారాయణ తండ్రి నాగయ్య కు హత్యానేరం మరియు సాక్ష్యాలను కనుమరుగు చేసేందుకు చేసిన ప్రయత్నానికి జీవిత ఖైదు మరియు 8000 రూపాయలను జరిమానా విధిస్తూ అక్టోబర్ 17న శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి పోలీస్ అధికారులను, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన సంతమాగులూరు సీఐ కె. వెంకటరావు, ఎస్ఐ ఎమ్. పట్టాభిరామయ్య, కోర్టు లైజనింగ్ సిబ్బంది, సంతమాగులూరు కోర్టు కానిస్టేబుళ్లను మరియు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. వసుంధర మరియు వై. ప్రశాంత కుమారి లను జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు. నేరం చేసిన వారికి న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లవుతుందని, ఇటువంటి తీర్పులు వెలువడినప్పుడు నేరం చేయాలనే ఆలోచన ఉన్నవారిలో భయం అనేది ఏర్పడుతుందని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు.



# సముద్రతీర ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ ఘటన కూడా చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 17**

బీచ్‌లలో ఈత వేయడం నిషేధం. మద్యం సేవించి ఎవరూ కూడా సముద్రంలోకి దిగడానికి వీలులేదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా కఠినంగా వ్యవహరించాలి. సూచించిన ప్రదేశాల్లో మాత్రమే యాత్రికులు స్నానాలు ఆచరించే విధంగా చర్యలు తీసుకోవాలి ఆ ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మద్యం సేవించి ఎవరూ కూడా సముద్రంలోకి దిగడానికి వీలులేదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ హాలులో బాపట్ల జిల్లా సముద్ర తీర ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో బాపట్ల జిల్లా ప్రధానమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పిడుగురాళ్ల నుండి వాడరేవు వరకు నిర్మిస్తున్న 167%జు% జాతీయ రహదారి పనులు త్వరలోనే పూర్తికానున్నాయని తెలిపారు. ఆ రహదారి అందుబాటులోకి వస్తే తెలంగాణ రాష్ట్రం నుండి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వాడరేవు, రామాపురం బీచ్ తదితర సముద్రతీరాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే సూర్యలంక సముద్ర తీరంలో పర్యాటకంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా నిజాంపట్నం వైపు నిర్మిస్తున్న రహదారి పూర్తయితే నిజాంపట్నం మండలంలోని సముద్రతీరాలకు యాత్రికులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని, ఇటీవల చోటుచేసుకున్న విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా, రాబోయే రోజుల్లో సముద్ర తీర ప్రాంతాల్లో పటిష్ట భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భౌగోళికంగా చూసుకుంటే నిజాంపట్నం నుండి చిన్నగంజాం మండలం వరకు బాపట్ల జిల్లాకు విశాలమైన సముద్రతీరం ఉందని తెలిపారు.; ఎక్కడపడితే అక్కడ యాత్రికులు సముద్రంలోకి దిగి స్నానాలు ఆచరించకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. చీరాలలోని వాడరేవు నుండి చిన్నగంజాం మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం వరకు సుమారు 9 కిలోమీటర్ల సముద్రతీరం ఉందన్నారు. ఈ సముద్రతీరం వెంబడి రోడ్డు మార్గం ఉండడంతో యాత్రికులు వారికి నచ్చిన ప్రదేశంలో వాహనాలను ఆపి సముద్రంలో స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు. తద్వారా అనేకమంది ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయన్నారు. వీటిని కట్టడి చేయడానికి పోలీస్ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే యాత్రికులు స్నానాలు ఆచరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సూచించిన ప్రదేశాలు మినహా ఇతర ప్రదేశాల్లో యాత్రికులు సముద్రంలోకి దిగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సముద్ర తీరాల్లో హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు యాత్రికులకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అడ్రెసింగ్; సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు యాత్రికులను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. సముద్రతీరం వెంబడి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా కూడా మద్యం సేవించకుండా, మద్యం సేవించి ఎవరు సముద్రంలోకి దిగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఉంచి ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ ఉండాలన్నారు. నూతన ఏటివి వాహనాలను ఏర్పాటు చేసుకుని వాటితో తీరం వెంబడి గస్తీ నిర్వహిస్తూ అడ్రెసింగ్ సిస్టమ్ ద్వారా యాత్రికులను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. తీరం వెంట లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లతో గజఈతగాళ్ళు, మెరైన్, స్థానిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సముద్రంలో పడవల ద్వారా కూడా గస్తీ నిర్వహించాలన్నారు. ఎవరైనా యాత్రికులు ప్రమాదానికి గురైతే వారిని రక్షించే విధంగా ఉండాలన్నారు. సముద్రతీరాల్లో నిఘా కోసం గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పాటు మరికొన్ని నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, దగ్గరలోనే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసుకుని అక్కడి నుండి ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేయాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసి, స్థానికంగా ఉన్న రిసార్ట్స్, హోటల్స్‌లో బస చేసి సముద్ర తీరాల్లో ఆహ్లాదకరంగా గడిపేందుకు వచ్చే యాత్రికులకు తగిన సూచనలు చేసి, సురక్షితమైన ప్రదేశాల్లో సముద్రంలోకి దిగి స్నానాలు ఆచరించే విధంగా చూసుకోవలసిన బాధ్యత సంబంధిత రిసార్ట్స్, హోటల్స్ నిర్వహకులపై ఉందన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని అతిథులుగా వచ్చే యాత్రికులకు తగిన సూచనలు ఇచ్చేందుకు గైడ్‌లను, సముద్రతీరంలో స్నానాలు ఆచరించే ప్రదేశాల్లో గజఈతగాళ్లను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.; ఈ నెల 22వ తేదీ నుండి కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో, శని, ఆది, సోమ వారాల్లో వేకువజాము నుండే భక్తులు సముద్ర తీరాలకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కనుక దానిని దృష్టిలో ఉంచుకొని తగిన విధంగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సముద్రతీరంలో తీసుకుంటున్న భద్రతా చర్యలకు సంబంధించిన వివరాలను శుక్రవారం రోజునే తెలపాలని సూచించారు. ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ భక్తులకు, యాత్రికులకు ఏటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే సంబంధిత పోలీసు అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేపల్లె డిఎస్పీ ఏ. శ్రీనివాసరావు, బాపట్ల డిఎస్పీ జి. రామాంజనేయులు, చీరాల డిఎస్పీ ఎం.డి. మోయిన్, డిసిఆర్బి డిఎస్పీ బాల మురళీకృష్ణ, జిల్లా ఎస్బి ఇన్స్పెక్టర్ జి. నారాయణ, రేపల్లె రూరల్ సీఐ పి. సురేష్ బాబు, బాపట్ల రూరల్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, ఇంకొల్లు సీఐ వై. వి. రమణయ్య, నిజాంపట్నం, అడవులదీవి, చీరాల రూరల్, చిన్నగంజాం ఎస్సైలు పాల్గొన్నారు.

## చీరాలలో ప్రజా దర్బార్ -90 అర్జీల స్వీకరణ



**చీరాల , పెన్ పవర్, అక్టోబర్ 17 :**

చీరాల క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల టిడిపి యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్‌నాథ్ పాల్గొని ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు.మొత్తం 90 అర్జీలు స్వీకరించగా, వాటిలో పెన్షన్‌కు 20, ఇళ్ల స్థలాలకు 65, ఇతర సమస్యలకు 5 అర్జీలు వచ్చాయి. అన్ని అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని గౌరీ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చీరాల మండల టిడిపి అధ్యక్షులు గంజి పురుషోత్తం, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, జనసేన పార్టీ నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, కౌన్సిలర్ సత్యానంద, నాగలక్ష్మి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీనే మనిషికి గొప్ప ఆభరణం



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 17**

పల్నాడు జిల్లా నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో మానవతా దృక్పథంతో కూడిన ఒక మంచి సంఘటన శుక్రవారం నాడు చోటుచేసుకుంది. టిఫిన్ చేయడానికి వచ్చిన కుంకలగుంటకు చెందిన ఆశపూర్ణ గోల్డ్ ఆభరణాలు అనుకోకుండా పోగొట్టుకున్నారు. అదే సమయంలో అక్కడ టిఫిన్ చేయడానికి వచ్చిన విజయ్‌కి ఆ ఆభరణాలు దొరకగా, నిజాయితీగా వ్యవహరించి నరసరావుపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. సీఐ ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో పోలీసులు గోల్డ్ ఆభరణాలను గుర్తించి యజమాని ఆశపూర్ణకు అప్పగించారు. విజయ్ చూపిన నిజాయితీని సీఐ ఫిరోజ్ ఖాన్ ప్రశంసించారు.

## నిబంధనలు పాటించని దుకాణం పై ఆర్డీఓ ఆగ్రహం



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 17**

రూరల్ పరిధిలో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ దుకాణాలను నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు చేపట్టిన ఈ తనిఖీల్లో కొన్ని దుకాణాలలో నిబంధనలు సరిగా లేకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ముఖ్యంగా, ఎస్‌వీ ఫైర్ వర్క్స్ అనే బాణాసంచా విక్రయ దుకాణాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ, అక్కడ భద్రతా లోపాలను గుర్తించారు. షాపులో పరిమితికి మించి ఎక్కువ మంది జనం ఉండడంపై ఆయన మండిపడ్డారు. "ప్రమాదం జరిగితే పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుంది. ఇంతమంది జనం ఒకేసారి షాపులో ఉండటం ప్రమాదకరం" అని ఆర్డీఓ హెచ్చరించారు.వెంటనే స్పందించిన ఆర్డీఓ, కిందిస్థాయి అధికారులను ఆదేశిస్తూ, బాణాసంచా విక్రేతలు బయట నిలబడి, లోపలికి ఎవరినీ అనుమతించ కుండా, గంటలోపు షాపులోని జనం అందరినీ ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్డీఓ వెంట రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు. భద్రతా ప్రమాణాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ స్పష్టం చేశారు.

## నేడు అద్దంకి, కొరిశపాడు మండలాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన

**పెన్ పవర్ అక్టోబర్ 17 అద్దంకి**

నేడు శనివారం అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం,అద్దంకి లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు కార్యక్రమాలలో పాల్గొంటారని మంత్రి రవికుమార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. శనివారం ఉదయం 09:00 గంటలకు కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం లో పాల్గొంటారని తెలిపారు. అలాగే ఉదయం 10:00 గంటలకు కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో ని బి.టి రోడ్డు ను ప్రారంభోత్సవం చేస్తారన్నారు. ఉదయం 11:00 గంటలకు నియోజకవర్గ కేంద్రమైన అద్దంకిలోని సింగరకొండ వెళ్లే రహదారిలో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12:00 గంటలకు అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం లో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

## బిజెపి అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులకు కార్యశాల...



**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 17**

ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి ఎపి అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్, మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, 20సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, తెలుగు , సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్ డి విల్సన్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారు దిలీప్, ఇతర నేతలు పివిఎన్ మాధవ్.. బిజెపి ఎపి అధ్యక్షులు. మన స్వదేశీ ఉద్యమాన్ని మరింత గా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి. మన పార్టీ ఆలోచనలు, అభిప్రాయాలు ను ప్రజలకు వివరించాలి. ప్రజాస్వామ్యం లో నాలుగో స్తంభం కనిపించని సింహం. నిష్ణాతులు అయిన వారు వివిధ అంశాలను వివరిస్తారు. చర్చ ఏవిధంగా చేయాలి, సబ్జెక్టు పై ఎలా అవగాహన పెంచుకోవాలి లో తెలుసుకోవాలి. మన వాణి ని మరింత ముందుకు తీసుకు వెళ్లాలి. ఈ శతాబ్ది ఉత్సవాలు సమయంలో సంఘ్ పై బురద జల్లే వారికి గట్టిగా సమాధానం ఇవ్వాలి. ఆర్.యస్.యస్. పని తీరు తెలుసుకుని ఎంతో మంది మహనీయులు భాగస్వామ్యులు అయ్యారు. నేటికీ ఆర్. యస్ యస్ అంటే చాలా మందికి తెలియదు. అందుకే ప్రపంచానికి, నేటి తరానికి ఆ గొప్పతనం వివరించాలి. దేశంలో ఎమర్జెన్సీ రోజులకు వ్యతిరేకంగా మరో స్వాతంత్ర్య పోరాటం చేశాం. వికసిత్ భారత్, వికసిత్ ఎపి కోసం అందరం కలిసి పని చేయాలి. ఆత్మ నిర్భర్ భారత్ కోసం ఎలా పని చేయాలో మోడీ దిశానిర్దేశం చేశారు. చిన్న, మధ్యతరగతి, సూక్ష్మ పరిశ్రమలు అభివృద్ధి చెందాలి. స్వయం సమృద్ధి కి గొప్ప చిహ్నం.. కరోనాకి మనం వ్యాక్సిన్ చేసి ప్రపంచ దేశాలకు అందించాం. బియస్.యన్.యల్ 4జి ద్వారా టెలికం రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. మన రక్షణ రంగం లో కూడా స్వయం సమృద్ధి సాధించేలా అడుగులు వేశాం. ప్రపంచ దేశాల్లో బారత్ కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే అది మోడీ వల్లే సాధ్యమైంది. అన్ని అంశాల్లో మన దేశం ఒకరి పై ఆధార పడకుండా స్వయం ప్రతిపత్తి గా నిలిపారు మోడీ. ఓకల్ ఫర్ లోకల్ అనిమోడి ఇచ్చిన పిలుపును అందరూ స్వాగతిస్తున్నారు

దేశం పట్ల మన ధక్పధం , మన ఆలోచనలు ప్రజలకు చెప్పాలి. సూపర్ జియస్టీ, సూపర్ సేవింగ్స్ సభలో మోడీ పాల్గొన్నారు. జియస్టీ ధరల తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలు ను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. ఈ అంశాలపై ముందు మనం అవగాహన. చేసుకోవాలి. మన రాష్ట్రానికి పది లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఎపి అభివృద్ధి కి, అమరావతి, పోలవరం పూర్తి కి కేంద్రం సహకారం ఇస్తుంది. గ్రీన్ ఎనర్జీ కోసం గ్రిడ్ లను ఏర్పాటు చేస్తున్నారు. క్రూడ్ ఆయిల్ విషయంలో ఇతర దేశాల పై ఆధారపడకుండా కొంతవరకు మనమే తయారు చేసుకోవచ్చు. విశాఖ లో డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయి. ఎపి త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా గ్లోబల్ హబ్ గా మారుతుంది. డబుల్ ఇంజన్ సర్కారు వల్ల జరిగే మేలు ఏమిటో ప్రజలు చూస్తారు. అనేక పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయి, వస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పధకాలు, అభివృద్ధి గురించి అధికార ప్రతినిధులు అవగతం చేసుకోవాలి. రాష్ట్రంలో పెద్ద ఎత్తున, ఉద్యగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. వరల్డ్ క్లాస్ క్యాపిటల్ నిర్మాణం కోసం మోడీ పునప్రారంభం చేశారు. మనం కూడా ఆ రాజధాని నిర్మాణం లో భాగస్వామ్యం కావాలి. రాష్ట్రం లో గత ప్రభుత్వం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కూడా మేము మళ్లీ వస్తాం , చంపేస్తాం అని బెదిరిస్తున్నారు. ఇలా చేసినందుకే 11 సీట్లకే పరిమితం చేసినా వారిలో మార్పు లేదు. మెడికల్ కాలేజ్ ల అంశాన్ని వివాదం చేస్తున్నారు.. తిప్పి కొట్టాలి. విశ్వనాధ సత్యనారాయణ చరిత్ర, విశిష్టత గురించి ప్రజలకు చెప్పాలి. ప్రతి జిల్లాల్లో ఉన్న ఇటువంటి మహనీయులు చరిత్ర ను నేటి తరానికి చెప్పాలి. కాంగ్రెస్ పాలనలో అవినీతి అడ్డగోలుగా జరిగింది. మోడీ పాలనలో అభివృద్ధి కేరాఫ్ అడ్రెస్ గా మారింది ఇలా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి.

## వాడరేవు బీచ్ వద్ద సిపిఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహణ



**వేటపాలెం,పెన్ పవర్,అక్టోబర్ 17**

వాడరేవు సముద్ర తీరంలో ఇటీవల చోటు చేసుకున్న విషాద మరణాల నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు సంభవించినప్పుడు సమయానికి సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో సిపిఆర్ శిక్షణ కార్యక్రమం వేటపాలెం మండలం రామాపురంలోని పాముకోస్ట్ రిసార్ట్ లో నిర్వహించబడింది.జిల్లా డిఎంహెచ్ఓ విజయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్ణి స్కాన్ అధినేత డాక్టర్ శ్రీకాంత్, బీచ్ రిసార్ట్స్ వైస్ ప్రెసిడెంట్ వీరేంద్ర, అపోలో హాస్పిటల్ డాక్టర్ రవి కిరణ్ పాల్గొని శిక్షణ అందించారు. కార్యక్రమంలో బీచ్ వద్ద విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు, సివిల్ పోలీసులు, మత్స్యకారులు, మరియు స్విమ్మర్స్ పాల్గొన్నారు.సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించే సమయంలో పొట్టలోని నీటిని బయటకు తీయడం, సిపిఆర్ ద్వారా ప్రాణాలను కాపాడే విధానాలపై ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్లు నిర్వహించారు. ఈపురుపాలెం ఎస్సై చంద్రశేఖర్ ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హాస్టల్ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం -ఎమ్మెల్యే నసీర్..





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 17.**

రాష్ట్రంలో హాస్టల్ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నామని, సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక బీసీ వసతి గృహంలోని 240 మంది విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా దుప్పట్ల కిట్ ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చలికాలం వస్తున్న నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులకు బ్లాంకెట్ల కిట్ ను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల మంది విద్యార్థులకు రూ.6.12 కోట్లతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 2700 మంది పిల్లలు ఉన్నారని, వీరందరికీ అందిస్తున్నామని తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.668 వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లోని ప్రతి విద్యార్థికీ పథకం అమలు చేశామని తెలిపారు. దీంతో పిల్లలందరికీ చదివించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాల మదింపు జరిగిందని, దీంతో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ విజయాలు నమోదయ్యాయని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షాజీలా, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తిలువరూరి పద్మావతి, కొనాకళ్ళ సత్యం, మొహమ్మద్ హాఫీజ్, షైక్ ముక్కరం, అబ్దుల్ సలీం, అబ్దుల్ హాఫీజ్, విజయ్ గుప్త, సయ్యద్ అన్వర్, కోట పిచ్చిరెడ్డి, వంగర ఏడుకొండలు, జూలూరి హేమంత్ గుప్తా, బ్రహ్మసాని శ్రీనివాస్, సముద్రాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి పై దాడి

## భారత రాజ్యాంగంపై దాడి చేసినట్లే - ఎం ఆర్ పి ఎస్ బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంద పెంచలయ్య మాదిగ





**పెన్ పవర్,అక్టోబర్ 17, అద్దంకి**

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై చెప్పులు దాడి జరగటం అమానుష చర్యని ఈ దాడిని ఖండిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి జిల్లా ఇన్చార్జి మంద పెంచలయ్య మాదిగ అన్నారు. మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టటం జరిగిందని పెంచలయ్య మాదిగ అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి, దళిత వర్గానికి చెందిన జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి గారిపై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తూ, మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి పిలుపుమేరకు శుక్రవారం అద్దంకి మండలం మరియు జె పంగులూరు మండలాల్లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీకార్యక్రమాలు నిర్వహించారు .అద్దంకి మరియు జెపంగులూరు మండలాల్లో నిర్వహించిన ర్యాలీల్లో కార్యక్రమాలలో పాల్గొన్న ప్రజలు అంబేద్కర్ భవనం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు నల్లజెండాలతో ర్యాలీగా వెళ్లి ఆయా మండలాల తాసిల్దార్ ల కి వినతిపత్రం అందించారు. సీజేఐ బి.ఆర్. గవాయి గారిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని, దాడి వెనుక ఉన్న కుట్రలను వెలికితీసేందుకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ముందుగా చేపట్టిన నిరసన కార్యక్రమాలలో ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంద పెంచలయ్య మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయి పై జరిగిన దాడి అంటే అది భారత రాజ్యాంగంపైనే దాడి చేసినట్లన్నారు. దోషులను వెంటనే విచారణకు లోను చేసి కఠిన శిక్షలు విధించాలన్నారు . కృష్ణ మాదిగ చేపట్టే తదుపరి ఉద్యమానికి బాపట్ల జిల్లా ఎమ్మార్పీఎస్ శ్రేణులు అండగా ఉంటాయి అని పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పూనూరు రమేశ్ మాదిగ మాట్లాడుతూ, సీజేఐ గవాయి గారు ఒంటరి కాదు. ఆయనకు అండగా ఎం ఆర్ పి ఎస్ , ఎం ఎస్ పి తో పాటు అన్ని దళిత ప్రజా సంఘాలు ఏకమై ఉన్నాయన్నారు. కృష్ణ మాదిగ నాయకత్వంలో ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా మరింత బలంగా తీసుకెళ్తామన్నారు . అద్దంకి మండల అధ్యక్షుడు పాలు పోగు సుబ్బారావు మాదిగ మాట్లాడుతూ ధర్మం ముసుగులో అధర్మవాదులు చేసిన ఈ చర్య దళిత సమాజాన్ని అవమానపరిచే ప్రయత్నంగా ఉందన్నారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే, కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం అని తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో జె పంగులూరు మండలం ఇన్‌చార్జి మట్టకొయ్య రాము మాదిగ, అద్దంకి మండలం ఇన్‌చార్జి పాలు పోగు సుబ్బారావు మాదిగ, అద్దంకి టౌన్ ఇన్‌చార్జి మున్నంగి పౌలు మాదిగ, శోభన్ బాబు, అనిల్, దావీదు, రాజేష్, యాకోబు, ఎలీషా, ఆదం, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి వేటపాలెం ప్రజల మద్దతు





**వేటపాలెం,పెన్ పవర్,అక్టోబర్ 17**

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శక్తివంతమైన ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించింది. వేటపాలెం పంచాయతీ పరిధిలోని వేటపాలెం గ్రామం గంగమ్మ గుడి ఆవరణంలో కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో కరణం వెంకటేష్ బాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గట్టి స్పందన తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రజలతో కలిసి కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రభుత్వం చేపట్టిన ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రజల్లో నిరసనగా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి చీరాల నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవ పున్నారెడ్డి వేటపాలెం మండల పరిధిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# చీరాల శక్తి టీం అప్రమత్తత తల్లిదండ్రుల వద్దకు బాలిక

**చీరాల, పెన్ పవర్ ,అక్టోబరు 17**

ఇంటి నుండి కోపంతో వెళ్లిపోయిన బాలికను శక్తి టీం సిబ్బంది గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. చీరాల కోట్లబజారులో ఒంటరిగా సూట్‌కేసులతో తిరుగుతున్న 17ఏళ్ల జాహ్నవి అనే బాలికను శక్తి టీం సిబ్బంది గుర్తించారు. బాలికతో ప్రేమగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వ్యక్తిగత కారణాలతో తల్లిదండ్రులపై కోపంగా ఇంటి నుండి బయటకు వచ్చిందని తెలిపింది. వెంటనే చీరాల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి సమక్షంలో బాలికకు, ఆమె తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిని కలిపారు.ఈ సందర్భంగా చీరాల వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఐపీఎస్ మార్గదర్శకత్వంలో శక్తి టీంలు మహిళలు, బాలికల రక్షణ కోసం అహర్నిశలు పని చేస్తున్నాయని తెలిపారు. సమయానికి జాహ్నవిని గుర్తించకపోయి ఉంటే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉండేదన్నారు.బాలికను సకాలంలో గుర్తించి కాపాడిన శక్తి టీం సిబ్బంది అయిన శివకుమారి, కానిస్టేబుల్ సుబ్బారావు, ఉమెన్ కానిస్టేబుల్ సునీతతో పాటు కౌన్సిలింగ్ ఇచ్చిన సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మిని జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఐపీఎస్ ప్రశంసించారు. యువత తల్లిదండ్రుల పట్ల కోపం, అవగాహన లోపంతో బయటకు వెళ్లిపోవడం సరైన పద్ధతి కాదని, తల్లిదండ్రుల మందలింపులు పిల్లల మంచి కోసమే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎస్పీ సూచించారు.



# పేదల పెన్నిధి, అపర భగీరధుడు ఎస్. జాన్ డేవిడ్ జయంతి

## చిలకలూరిపేటకు మంచినీటి కొరతను తీర్చిన దాత సేవలను గుర్తు చేసుకుంటున్న ప్రజలు

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 17**



చిలకలూరిపేట: అపర భగీరధుడుగా, పేదల పెన్నిధిగా పేరుగాంచిన ఎస్. జాన్ డేవిడ్ జయంతి (అక్టోబరు 17). ఈ సందర్భంగా ఆయన చేసిన విశేష సేవలను, మానవతా కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ముఖ్యంగా చిలకలూరిపేట ప్రాంతానికి మంచినీటి కొరతను తీర్చడంలో ఆయన చూపిన చొరవ అసామాన్యం. ఎస్. జాన్ డేవిడ్ 1926, అక్టోబర్ 17న విశాఖపట్నం జిల్లా, నర్సీపట్నం మండలం, బలిఘట్టం గ్రామంలో సూరాల గాబ్రియేల్, కృపమ్మ దంపతులకు జన్మించారు. చిన్నతనంలో గ్రామంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల ఆయన తన తండ్రిని కోల్పోయారు. ఈ విషాదం ఆయన హృదయంలో పేదలకు సహాయం చేయాలనే తపనను, సేవా కార్యక్రమాలకు అంకురార్పణ చేసింది. లక్షలాది మందికి సహాయం చేయాలనే లక్ష్యంతో డాక్టర్ జాన్ డేవిడ్ ఏఎంజి ఇండియా ఇంటర్నేషనల్ సంస్థను స్థాపించారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఉచిత విద్య, వైద్యం వంటి సౌకర్యాలను కల్పించి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన మహాదాత ఆయన. ఏఎంజి ఇండియా ఇంటర్నేషనల్‌తో పాటు, ఫార్ కార్నర్స్ ఇండియా మరియు వేద వంటి సంస్థలకు కూడా ఆయన వ్యవస్థాపకులుగా వ్యవహరించారు.. జాన్ డేవిడ్ కేవలం సేవ చేయడమే కాకుండా, ఎక్కడ ఏ విపత్తు సంభవించినా 'నేనున్నానంటూ' ముందుండి బాధితులకు తనవంతు సాయం అందించిన మహోన్నత వ్యక్తి. ఆయన చేసిన సేవలు ఎంత గొప్పవంటే, ఎంతో మంది అనాథలు తమ తండ్రి పేరు స్థానంలో ఎస్. జాన్ డేవిడ్ పేరును పెట్టుకున్నారంటే ఆయన వారికి తండ్రిలాగా సకల సౌకర్యాలు కల్పించి, దగ్గరుండి వివాహాలు కూడా చేయించిన గొప్ప వ్యక్తిత్వం ఆయనది. ఏఎంజి ద్వారా ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల్లోని లక్షలాది మంది ప్రజలు విద్య, వైద్యం, తదితర సౌకర్యాల రూపంలో సేవలు పొందారు. ఎస్. జాన్ డేవిడ్ లేక పోయినా, ఆయన బాటలో అరుణ్ కుమార్ మహంతి జాన్ డేవిడ్ నడుస్తూ, కొన్ని లక్షల మందికి సేవ చేస్తూ, విద్యా వైద్య తదితర సౌకర్యాలను కల్పిస్తూ ఆ మహనీయుని ఆశయాలను ముందుకు తీసుకుపోతున్నారు. అక్టోబర్ 17 న ఎస్. జాన్ డేవిడ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రజలు నివాళులర్పిస్తున్నారు.

# పైడమ్మ గుడి పాలకమండలి ప్రమాణస్వీకారం








**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం(పెన్ పవర్)అక్టోబర్ 17:**

పెడన పైడమ్మ అమ్మవారి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం దేవస్థానం ప్రాంగణంలో వైభవంగా జరిగింది. రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు పర్యవేక్షణలో దేవస్థానం ఈవో గోవాడ వెంకటకృష్ణారావు సహకారంతో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ కే. శ్రీనివాసరావు పాలక్ మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకమండలి సభ్యులుగా బొడ్డు ఆనందరావు, మల్లంపల్లి శ్రీనివాసరావు, మామిడి సునీత, కోమట్ల సాంబశివరావు, బొల్లా. యల్లారమ్మ, శీలం నాగ సత్యనారాయణ, కోరుమిల్లి ఝాన్సీ, శానాపతి. దుర్గాభవాని, చంద్రు. వడ్డీకాసులు, దాసు శ్యామ్ లు ప్రమాణ స్వీకారం చేశారు. తమకు ఈ పదవులు రావడానికి సహకరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలసౌరి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు కు మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందు మండలి సభ్యులు పండితులు రెండు చింతల భవాని నేతృత్వంలో పైడమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలి సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆగష్టేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ళ ప్రసాద్, టిడిపి నాయకులు యక్కల. శ్యామలయ్య, చందన. నారాయణరావు, కమ్మగంటి వెంకటేశ్వరరావు, పరసా జితేంద్ర, శానా పతి. అజయ్ కుమార్, కుర్షిద్ బేగం, మేడక కిషోర్, బిజెపి నాయకులు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి. రాధాకృష్ణ, జనసేన పార్టీ నాయకులు కౌన్సిలర్ మట్టా. శివపావని, పత్తిపాటి వెంకటరమణ, కూనపరెడ్డి రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు జడ్జి పై దాడిని ఖండిస్తూ తహసీల్దార్ కి వినతిపత్రం...

**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్)అక్టోబర్ 17:**

చిట్టూరి అర్జునరావు మాదిగ ( ఎమ్మార్పీఎస్ ) కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు ,మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు మట్టా గోపాలకృష్ణ ఆధ్వర్యంలో దళితుడు అయిన సుప్రీంకోర్టు జడ్జి అయినా బిఆర్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ తాసిల్దార్ కి వినత పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బండారీ సోమేశ్వరరావు మాదిగ (ఎంఎస్పి ) నియోజకవర్గ అధ్యక్షుడు జూనపూడి పృథ్వీ (ఎమ్మార్పీఎస్) మండల అధ్యక్షుడు మరియు నియోజకవర్గ గురివిందపల్లి విజయబాబు,చిట్టూరి యువరాజు,బేతపూడి రవి,జాన్, నాని, దాస్ ,విజయ్,బాలాజీ, చిట్టి,వర,ప్రభాస్,వంశీ,రాకేష్ మాదిగ సోదరులు అధికంగా పాల్గొన్నారు.

# డాక్టర్ కొండలరావుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన విజయ్ నాగరాజు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 17**

ఐకాన్ హాస్పిటల్ అధినేత కొండలరావు కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన కర్లపాలెం టిడిపి యువ నాయకులు మద్దిబోయిన విజయ నాగరాజు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు..

# కొండవీడు కోట పర్యాటక అభివృద్ధికి చర్యలు

## జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 17**

రాష్ట్ర రాజధాని అమరావతికి సమీపంలో ఉన్న చారిత్రక, సుందరమైన పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోట అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కీలక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు. కోట అభివృద్ధి కోసం అటవీ శాఖ, పర్యాటక శాఖల నుంచి అవసరమైన అనుమతులు, నిధులు సమకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాగే పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలిస్తున్నామని ఆమె తెలిపారు. గురువారం నాడు కొండవీడు కోటను సందర్శించిన కలెక్టర్ కృతిక శుక్లా, కోటకు చేరుకునే ఘాటు రోడ్డు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. అయితే, ఈ ఘాటు రోడ్డును ప్రధాన రహదారులతో అనుసంధానించే మార్గంలో మరమ్మతు పనులు అవసరమని, వీటిని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పర్యాటకులకు మెరుగైన అనుభవం అందించేందుకు కాయకింగ్, ట్రెక్కింగ్, బోటింగ్ వంటి కార్యకలాపాలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అంతేకాక, నైట్ క్యాంపింగ్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కొండవీడు కోట అభివృద్ధికి స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఎప్పటికప్పుడు అధికారులకు విలువైన సూచనలు అందజేస్తూ సహకరిస్తున్నారని కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్శన కార్యక్రమంలో డీఎఫ్ఓ కృష్ణప్రియ, ఆర్డీవో మధులతతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. కొండవీడు కోటను ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ చర్యలు ఊపందుకుంటాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాల ద్వారా కొండవీడు కోట చారిత్రక, సాంస్కృతిక విలువలను కాపాడుతూనే, రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.



# పొదిలిలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్న జంకె



**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 17**

పొదిలిలో శుక్రవారం నాడు జరిగిన ఒక వివాహ వేడుకల్లో మాజీ శాసనసభ్యులు, వైయస్సార్సీపి సీనియర్ నాయకులు జంకి వెంకటరెడ్డి పాల్గొన్నారు. పట్టణానికి చెందిన ముల్లా భాష వివాహ వేడుకల్లో పాల్గొన్న జంకె వెంకటరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జంకి వెంకటరెడ్డి తో పాటు మర్రిపూడి మండల పరిషత్ అధ్యక్షులు వాకా వెంకటరెడ్డి, వైయస్ఆర్సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జి శ్రీనివాసులు, గొలమారి చెన్నారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, ముల్లా ఖాదర్ భాష, ఉద్యోగ సంఘం నాయకులు ముల్లా జిందా బాషా తదితరులు పాల్గొన్నారు.

# 24న మాలకొండలో హుండీ లెక్కింపు



**వలేటివారిపాలెం,పెన్ పవర్ అక్టోబర్ 17**

అయ్యవారిపల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి హుండీ లెక్కింపు ఈ నెల 24 న (శుక్రవారం) ఉదయం 8 గంటలకు కొండపైన కల్యాణ మండపం నందు దేవస్థానంలో జరుగునట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 17**

కళవళ్ళ గ్రామంలో శుక్రవారం జరిగిన అబ్బూరి గంగయ్య కుమారుడు శ్రీనివాస్ వివాహ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు . ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు, నార్నే రోశయ్య, మోదేపల్లి నారాయణ, మోదేపల్లి మాలకొండయ్య మరి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పెళ్లి కుమారుడుని ఆశీర్వదించిన కదిరి పార్థసారథి

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 17**

సిఎస్ పురం గ్రామానికి చెందిన యాళ్ల వెంకట నారాయణ గారి కుమారుడు నరేంద్ర వివాహం సందర్భంగా గురువారం రాత్రి కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ కదిరి పార్థసారథి వారి నివాస గృహనికి వెళ్ళి నరేంద్ర ను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.



# యువతే దేశ అభివృద్ధికి వెన్నెముక - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 17**

భారతదేశ అభివృద్ధికి యువతే వెన్నెముక అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. యువతలోని శక్తి, మేధోసంపత్తి సమాజానికి ఎంతో ఉపయోగపడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా యువజన వ్యవహారాల శాఖ స్టెప్ ఆధ్వర్యంలో శుక్రవారం క్విజ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఇతర అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత నుంచి నూతన ఆవిష్కరణలు, ఆలోచనల;కోసం సమాజం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ నూతన ఆలోచనలు, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించేందుకు యువతకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యువతకు మెరుగైన భవిష్యత్తును కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. తాను కూడా జిల్లాలో ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రత్యేకంగా జిల్లాకు సంబంధించిన ఒక యాప్ ను అభివృద్ధి చేయిస్తున్నానన్నారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ రంగాలలో నిపుణులైన వారితో జిల్లాలోని యువత అనుసంధానం కావచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్టెప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈ యువజనోత్సవాలలో 7 అంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, వీరిలో జిల్లా స్థాయి లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా తరపున పంపుతామని తెలిపారు. కావున ఈ పోటీలలో పాల్గొనేవారు తమ నైపుణ్యాలను ప్రదర్శించి, ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని ఆకలింపు చేసుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ విద్యా బోధనతో పాటు విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలకు తాము ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రమాదకరమైన డిజిటల్ ఎడిక్షన్, మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా యువతలోని ప్రతిభ వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి అన్నారు. మెప్మా పిడి శ్రీహరి మాట్లాడుతూ యువజనోత్సవాల వలన కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన వినూత్న ప్రాజెక్టులను కలెక్టరు సందర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# ఖరీఫ్ లో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలి

## - జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ అక్టోబర్ 17**

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్ కు గానూ 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, ధాన్యం కొనుగోలుకు ఇప్పటినుంచే అవసరమగు ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జాయింట్ కలెక్టర్ గోపాల క్రిష్ణ, జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు గాను ధాన్యం కొనుగోళ్ల సంసిద్ధతపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రైతుల నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. ఇందుకు గాను 25 మండలాల్లో 185 రైతు సేవా కేంద్రాల పరిధిలో మొత్తం 45 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు అవసరమైన రవాణా, హమాలీలు, గోనె సంచులను, తేమశాతం కొలిచే యంత్రాలను ముందుగా అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. గత సీజనులో తలెత్తే సమస్యలు మరలా పునరావృతం కాకుండా ఇప్పటినుంచే పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో డిసెంబర్ మాసం నుండి వరి ధాన్యం కోతల ప్రారంభ మవుతాయని, నవంబరు మాసాంతానికి అవసరమైన ఏర్పాటు పూర్తిచేసుకోవాలని ఆయన చెప్పారు. ఏ ఒక్క రైతుకీ ఎటువంటి సమస్య లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీచేసిందని, కావున పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదని, ముందస్తు ప్రణాళికతో ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా దిశా నిర్దేశం చేశారు. ఆర్.ఎస్.కే ల తో మాపింగ్, రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలనీ తెలిపారు. పౌర సరఫరాల అధికారులు మిల్లులను ట్యాగ్ చేయడం, బ్యాంకు గ్యారంటీ లను తీసుకోవడం, అన్ని మిల్లుల పని చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయడం, సంబంధిత సిబ్బందికి శిక్షణ పూర్తి చేయడం వంటి కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులను



ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉండరాదని, అలా రైతులను ఇబ్బంది పెట్టిన మిల్లర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేసారు. వాతావరణ పరిస్థితులను కూడా దృష్టి లో ఉంచుకుని అందుకనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గ్రామ, మండల స్థాయి ధాన్యం సేకరణ కమిటీలు సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు రైతు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అనే విషయాన్ని విస్తృతంగా రైతులకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పౌర సరఫరాలు, మార్క్ ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ఏ ఒక్క రైతుకీ ఎటువంటి సమస్య లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కనిగిరి ఆర్డిఓ కేశ వర్ధన్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, పౌరసరఫరాల శాఖ డిఎం వరలక్ష్మి, మార్కెటింగ్ ఎడి వరలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయ్ మీద దాడిహేయమైన చర్య

## ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నేపూడి వినయ్ మాదిగ




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 17**

దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నేపుడి వినయ్ మాదిగ అన్నారు. యం ఆర్ పి యస్ వ్యవస్థాపక అధ్యక్షుడు,పద్మభూషణ్ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని అంబెద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గర్నేపూడి వినయ్ మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ గవాయ్ మీద దాడికి చేసేందుకు ప్రయత్నం చేసిన లాయర్ రాకేష్ కిషోర్ మీద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని,దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి శిక్షలు పడేలా సమగ్రమైన విచారణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ దాడి అనాగరికమైనదని,ప్రజాస్వామిక స్ఫూర్తి రాజ్యాంగ మీద జరిగిన దాడి అన్నారు.దళితుడైన బిఆర్ గవాయ్ పై దాడి చేసి దళిత,పీడిత వర్గాల ప్రజలను మనోవేదనకు గురి చేసిందని అన్నారు.కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేక దాడికి తెగపడుతున్నాయని మండిపడ్డారు.ఈలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా సుప్రీంకోర్టులో అనుభవం కలిగిన ప్రజా స్వామిక దృక్పథం కలిగిన విశ్రాంత జడ్జీలను నియమించి విచారణ జరిపించాలని కోరారు.న్యాయవ్యవస్థలో జరిగిన దాడి యావత్తు దేశం సిగ్గుపడేలా చేసిందని అన్నారు.అనంతరం ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాలపాటి విజయ్ బాస్కర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెదూరి అశోక్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బరిగెల దాసు,గంగయ్య,కోట డేవిడ్,బడిపాటి ఓబులు, కే గురవయ్య, ఇస్సాకు,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న పత్తి రామమూర్తి

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 17**

మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామానికి చెందిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవకుడు పత్తి రామ్మూర్తి శుక్రవారం చరిత్రకారుడు, రచయిత, సంఘం సంస్కర్త నారాయణస్వామి (మైనాస్వామి) తో కలిసి శ్రీకృష్ణదేవరాయ వర్ధంతి వేడుకలలో పాల్గొన్నారు ఈ సందర్భంగా సత్య సాయి జిల్లా గోరంట్ల లో కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణదేవరాయల పరిపాలనలో అన్ని కులాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించారని తెలిపారు



రామేశ్వరాలయం తదితర చోట్ల శాసనాలను 1510 లో రాయించినట్లు, లక్షలాది దేవాలయ భూములకు ఎటువంటి పన్నులను చెల్లించిన అవసరం లేకుండా దానం చేసినట్లు, ఒక్కో గుడికి వజ్ర వైడూర్య బంగారు అభరణాలతో పాటు వేయి గోవులను కృష్ణ రాయల్ దానం చేసినట్లు శాసనాలు తెలుపుతున్నాయని అన్నారు ఫిబ్రవరి 16న రాయలవారి జయంతి, ఆగస్టు 7న పట్టాభిషేకం, అక్టోబర్ 17న వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

## - విద్యుత్ ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ అక్టోబర్ 17**

11 కె.వి. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఫీడర్ లో టవర్స్ నిర్మాణ పనుల కారణంగా ఇస్లాంపేట, అద్దంకి బస్టాండ్ సెంటర్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలకు శనివారం ఉదయం 7 గం. నుండి మధ్యాహ్నం 2 గం. వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని, ట్రీ కటింగ్ కారణంగా ఉదయం 7 గం. నుండి మధ్యాహ్నం 12 గం. వరకు క్లౌపేట ఏరియా అంతటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ కె.వి. పాండురంగ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# దర్శి పట్టణంలో చిల్లరంగళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన దర్శి సీఐ వై రామారావు





**దర్శి అక్టోబర్ 17 పెన్ పవర్**

దర్శి సర్కిల్లో రానున్న దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని ఈరోజు దర్శి పట్టణంలో చిల్లర అంగళ్లను దర్శి సిఐ వై రామారావు ఆకస్మికంగా తనిఖీ చేసి ఆ షాపులలో ఎవరైనా అనుమతి లేకుండా బాణాసంచాను అమ్మటానికి నిల్వ ఉంచి ఉన్నారేమోనని సోదాలు చేయడం జరిగింది. దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డు లో ఉన్న హోల్సేల్ అంగళ్లను దర్శి సిఐ వై రామారావు మరియు దర్శి ట్రాఫిక్ ఎస్ఐ భాష వారి సిబ్బంది తోటి తనిఖీ చేసి ఆ షాపుల వారికి ఎలాంటి బాణాసంచా సామాగ్రి ఉంచరాదు అని వారికి చెప్పడం జరిగింది. అలాగే ఎవరైనా అనుమతి లేకుండా బాణాసంచా సామాగ్రిని వారి షాపుల వద్ద గాని గోడౌన్ల వద్ద గాని ఇళ్ల వద్ద గాని పెద్ద మొత్తంలో నిల్వ ఉంచుకున్న, అమ్మినా అటువంటి వారిపైన చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది అని హెచ్చరించారు.

# దేవకిని కలిసిన ఆర్యవైశ్యులు

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, అక్టోబర్ 17**

శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కనిగిరికి విచ్చేసిన జాతీయ వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు, రాష్ట్ర జనసేన నాయకులు దేవకి వెంకటేశ్వర్లును పట్టణ ఆర్యవైశ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాచపూటి వెంకటేశ్వర్లు, బచ్చు రమేష్, చక్కా బసవేశ్వరరావు, అన్నా రంగనాయకులు, వేమ సత్యం, పైడిమర్రి కృష్ణ, గాదంశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇద్దరు స్టార్ ప్లేయర్లను వదులుకుంటున్న ఢిల్లీ.. రూ.25 కోట్లతో ఆసీస్ స్టార్ ఆటగాళ్లపై కన్ను!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. టోర్నీ ప్రారంభంలో ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో గెలిచి దూసుకెళ్లిన ఆ జట్టు ఆ తర్వాత వరుసగా ఓడిపోయి ప్లే ఆఫ్స్ కు చేరుకోవడంలో విఫలమైంది. రానున్న సీజన్ లో అక్షర్ పటేల్ ను కెప్టెన్సీ నుంచితప్పించాలని చూస్తున్న క్యాపిటల్స్ జట్టులో భారీ మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2026 ఐపీఎల్ మినీ వేలానికి ముందు జట్టును మరింత పటిష్టం చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇద్దరు స్టార్ ప్లేయర్లను రిలీజ్ చేసే ఆలోచనలో కనిపిస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ రిలీజ్ చేసే ఆటగాళ్లు.. టార్గెట్ చేసే ఆటగాళ్లు ఎవరో ఇప్పుడు చూద్దాం..

2026 ఐపీఎల్ మినీ వేలంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. డిసెంబర్ 13 నుంచి 15 వరకు ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ జరగనున్నట్టు సమాచారం. ఇంకా అధికారిక డేట్ కన్ఫర్మ్ కాలేదు. ఇప్పటి నుంచే ఫ్రాంఛైజీలు తమ ప్లేయర్ల రిటెన్షన్, రిలీజ్ జాబితాలపై ఫోకస్ పెట్టాయి. 10 ఫ్రాంచైజీలు ఆటగాళ్ల రిటైన్ పై ఒక ఒక అంచనాకు వచ్చాయి. ఢిల్లీ క్యాపిటల్స్ రిలీజ్ చేసే ఆటగాళ్లలో టీమిండియా స్టార్ ఆటగాడు కేఎల్ రాహుల్ ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రాహుల్ తో పాటు ఆసీస్ స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ను సైతం ఢిల్లీ రిలీజ్ చేయాలని భావిస్తోందట. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ లో రాహుల్ ను రూ. 14 కోట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. ఈ టోర్నీలో రాహుల్ స్థాయికి తగ్గట్టు రాణించలేదని ఢిల్లీ యాజమాన్యం అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. ముఖ్యంగా ప్లే ఆఫ్స్ కు ముందు జరిగిన కీలక మ్యాచ్ ల్లో రాహుల్ విఫలం కావడం ఢిల్లీ బాగా హర్ట్ అయినట్టు తెలుస్తోంది. దీనికి తోడు కేఎల్ స్ట్రైక్ రేట్ పై నిరాశగా ఉందట. రాహుల్ తో పాటు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ను ఢిల్లీ రిలీజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2025 మెగా ఆక్షన్ లో స్టార్క్ ను ఢిల్లీ రూ. 14 కోట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. అయితే స్టార్క్ మాత్రం ఒకటి రెండు మ్యాచ్ ల్లో మినహాయిస్తే పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు.

**గ్రీన్, మిచెల్ ఓవెన్ పై కన్ను:**

ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ ఐపీఎల్ 2026 మినీ వేలంలో దిల్ క్యాపిటల్స్ దక్కించుకోవాలని భావిస్తోందట. గ్రీన్ బ్యాటింగ్ తో పాటు బౌలింగ్ చేయగలడు. ఇలాంటి ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ జట్టులో ఉంటే ఏ జట్టు అయినా పటిష్టంగా మారుతుంది. ఈ ఆజానుభావుడుపై చాలా ఐపీఎల్ జట్లు కన్నేసినట్టు సమాచారం. గాయంతో 2025 ఐపీఎల్ కు దూరమైనా గ్రీన్ మళ్ళీ క్రికెట్ లోకి అడుగుపెట్టాడు. తన రీ ఎంట్రీలోనే ఈ ఆసీస్ ఆల్ రౌండర్ టాప్ ఫామ్ తో చెలరేగుతున్నాడు. వెస్టిండీస్ పై ఇటీవలే ముగిసిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో బ్యాటింగ్ లో గ్రీన్ దంచికొట్టాడు. వరుసగా 51, 56లి, 11, 55లి, 32 స్కోర్లు చేసి సత్తా చాటాడు. అంతేకాదు ఆదివారం (ఆగస్టు 10) సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో 13 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 35 పరుగులు చేశాడు.

**ఎవరీ మిచెల్ ఓవెన్..?**

మిచెల్ ఓవెన్ 2024-25లో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. హెూబర్ట్ హరికేన్స్ తరపున 200 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 452 పరుగులు చేశాడు. బిగ్ బాష్ లీగ్ ఫైనల్లో ఓవెన్ కేవలం 42 బంతుల్లో 108 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్ లో 11 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. బిగ్ బాష్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసి సంచలనం సృష్టించాడు. ఈ మెగా ఫైనల్లో 39 బంతుల్లో సెంచరీ చేసి పాకిస్థాన్ సూపర్ లీగ్ లో.. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు ఎంపికయ్యాడు.

# ఇండియా, ఆస్ట్రేలియా మెగా సిరీస్.. స్క్వాడ్, టైమింగ్, షెడ్యూల్ లైవ్ స్ట్రీమింగ్ వివరాలు ఇవే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా, ఇండియా జట్ల మధ్య అక్టోబర్ 19 నుంచి జరగబోయే వన్డే సిరీస్ కు భారీ హైప్ నెలకొంది. ఈ రెండు ప్రపంచంలోనే అగ్ర జట్లు కావడంతో ఈ సిరీస్ క్రేజ్ నెక్స్ట్ లెవల్లో ఉంది. ఆడేది మూడు వన్డే మ్యాచ్ లే అయినప్పటికీ టీ20 సిరీస్ కంటే వన్డే సిరీస్ కు ఎక్కువగా క్రేజ్ ఉండడం విశేషం. టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లోకి బరిలోకి దిగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇప్పటికే ఆస్ట్రేలియా చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ మొదలుపెట్టింది. నయా కెప్టెన్ గిల్ టీమిండియాను నడిపించనున్నాడు. 2020 తర్వాత ఇండియా తొలిసారి వైట్ బాల్ ఫార్మాట్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకు వన్డే సిరీస్.. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 19న పెర్త్ లో తొలి వన్డేతో టూర్ మొదలవుతుంది. అక్టోబర్ 23 న అడిలైడ్ లో రెండో వన్డే.. అక్టోబర్ 25 న సిడ్నీలో మూడో వన్డే జరుగుతుంది. ఆ తర్వాత టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 29 న మనుకా ఓవల్ లో తొలి టీ20 ప్రారంభమవుతుంది. నవంబర్ 8 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. ఈ హై వోల్టేజ్ సిరీస్ కు రెండు జట్ల స్క్వాడ్, టైమింగ్, షెడ్యూల్ లైవ్ స్ట్రీమింగ్ వివరాలు ఇప్పుడు చూద్దాం..

ఇండియా, ఆస్ట్రేలియా వన్డే సిరీస్: తేదీలు, వేదికలు
తొలి వన్డే : అక్టోబర్ 19, పెర్త్ స్టేడియం, పెర్త్
రెండవ వన్డే: అక్టోబర్ 23, అడిలైడ్ ఓవల్, అడిలైడ్
మూడవ వన్డే: అక్టోబర్ 25, సిడ్నీ క్రికెట్ గ్రౌండ్, సిడ్నీ
టైమింగ్, లైవ్ స్ట్రీమింగ్, టెలికాస్టింగ్ వివరాలు:
మూడు వన్డేలు భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నాయి. టాస్ ఉదయం 8:30 గంటలకు వేస్తారు.
లైవ్ టెలికాస్ట్: స్టార్ స్పోర్ట్స్ నెట్ వర్క్ మూడు వన్డేలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది
లైవ్ స్ట్రీమింగ్: జియో సినిమా యాప్, వెబ్‌సైట్ లో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది.
వన్డే సిరీస్ కు ఇండియా స్క్వాడ్:
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ధృవ్ జురెల్, యశస్వి జైస్వాల్, నితీష్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ కృష్ణ సింగ్
ఇండియాతో వన్డే సిరీస్ కు ఆస్ట్రేలియా జట్టు:
మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, మాథ్యూ కుహ్నెమాన్, మార్నస్ లాబుస్చాగ్నే, మిచెల్ ఓవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ రెన్షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్
రెండు, మూడు వన్డేలకు: ఆడమ్ జంపా , అలెక్స్ కారీ , జోష్ ఇంగ్లిస్

# 20 ఏళ్ళ ముందే మేము బజ్ బాల్ పరిచయం చేశాం.. యాషెస్‌కు ముందు హీట్ పెంచేసిన గిల్‌క్రిస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగబోయే ప్రతిష్టాత్మకమైన యాషెస్ కు నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఇండియాతో పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు న్యూజిలాండ్ తో ఇంగ్లాండ్ జట్టు టీ20 సిరీస్ ఆడనుంది. ఈ రెండు సిరీస్ ల తర్వాత ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు యాషెస్ లో తలపడతాయి. నవంబర్ 21 నుంచి జరగబోయే ఈ సమరానికి ఆస్ట్రేలియా వేదిక కానుంది. ఈ మెగా సిరీస్ కు ముందు ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఇంగ్లాండ్ పై అదిరిపోయే కౌంటర్ విసిరి సిరీస్ కు ముందు హీట్ పెంచేశాడు. ఇంగ్లాండ్ ఓపెనర్ జాక్ క్రాలీ ఇటీవలే ఆస్ట్రేలియాపై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. బజ్ బాల్ ఆట తీరు ముందు ఆస్ట్రేలియా తట్టుకోలేదు అనేట్టుగా కామెంట్స్ చేశాడు. క్రాలీ కామెంట్స్ కు గిల్‌క్రిస్ట్ అదిరిపోయే రిప్లై ఇచ్చాడు. గిల్‌క్రిస్ట్ మాట్లాడుతూ ఇలా అన్నాడు.. " మేము 20 సంవత్సరాల ముందే బజ్ బాల్ ఆట ఆడేవాళ్ళం. 2000 సంవత్సరం ప్రారంభంలో ఆస్ట్రేలియా దూకుడైన ఆట తీరు ఆడింది. రికీ పాంటింగ్, మాథ్యూ హేడెన్ వంటి ఆటగాళ్ళు టెస్ట్ క్రికెట్‌లో ఎటాకింగ్ ఆడుతూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించేవారు. బజ్ బాల్ ఆటకు ఆకర్షణీయంగా మారుతుంది. రానున్న యాషెస్ లో ఇది కొనసాగాలని భావిస్తున్నాను". అని కాయో స్పోర్ట్స్‌లో గిల్‌క్రిస్ట్ అన్నాడు. క్రికెట్ లో ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ కంటే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా యాషెస్ కు ఎక్కువ క్రేజ్ ఉందని భావిస్తారు. 1882లో తొలిసారి యాషెస్ సిరీస్ జరిగింది. ప్రతి రెండేళ్లకోసారి ఈ ప్రతిష్టాత్మక సిరీస్ వచ్చినప్పుడల్లా క్రికెట్ ప్రపంచంలో చర్చ జరుగుతూనే ఉంటుంది. నవంబర్ 21 నుంచి ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ స్టార్ట్ అవుతుంది. సొంతగడ్డపై జరగబోయే ఈ టెస్ట్ సిరీస్ ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఆస్ట్రేలియా ఉంది. మరోవైపు 2015 నుంచి యాషెస్ గెలవని ఇంగ్లాండ్ ఎలాగైనా ఆసీస్ కు షాక్ ఇవ్వాలని చూస్తోంది. చివరిసారిగా ఇంగ్లాండ్ లో జరిగిన యాషెస్ 2-2 తో సమమైంది. తొలి రెండు టెస్టులు ఆస్ట్రేలియా గెలిస్తే చివరి మూడు టెస్టుల్లో ఇంగ్లాండ్ రెండు టెస్టులు గెలిచింది. ఒక మ్యాచ్ డ్రా గా ముగిసింది. అంతకముందు 2021-22 యాషెస్ లో ఆస్ట్రేలియా 4-0తో గెలిచింది. ఆస్ట్రేలియా చివరి 15 స్వదేశీ టెస్టుల్లో రెండింటిలో మాత్రమే ఓడిపోయింది. ఓవరాల్ గా ఇప్పటి వరకూ చరిత్రలో మొత్తం 330 యాషెస్ టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో ఆస్ట్రేలియా 136 టెస్టులు, ఇంగ్లండ్ 108 టెస్టులు గెలవగా.. 91 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఇటీవలే ఇండియాతో ఇంగ్లాండ్ 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను 2-2 తో సమం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా వెస్టిండీస్ పై 3-0 తేడాతో గెలిచింది.



# నా విషయంలో అనుకున్నదాని కంటే ఎక్కువే జరిగింది





ఎవరి జీవితం ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటుందో చెప్పలేం. లైఫ్ లో ఏదీ ప్లాన్ చేసి రాదు అని అంటోంది మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. జీవితం ఊహించని మలుపులు తీసుకుంటుందని, అది మనల్ని ఎవరూ ఊహించని ప్రదేశాలకు తీసుకెళుతుందని చెప్పింది. తన కెరీర్ విషయంలో తన ఇమాజినేషన్ కు మించి జరిగిందని ఆమె కొత్త సినిమా బైసన్ ప్రమోషన్స్ లో భాగంగా ఓ సందర్భంలో తెలిపింది. అవును, కరక్టే ఆమె విషయంలో అదే జరిగింది. ఒక్కటైనా మంచి సినిమాలో నటించాలని కెరీర్ ప్రారంభించిన ఆమెకు, గడిచిన 10ఏళ్లలో అనేక మంచి క్యారెక్టర్లు పడ్డాయి. ఈ ఒక్క ఏడాదిలోనే అనుపమ కీలక పాత్ర పోషించిన డ్రాగన్, జానకీ వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ, పరదా, కిష్కిందపురి సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. ఈ నాలుగు సినిమాలు నాలుగు విభిన్న కథలు. నాలుగింట్లో అనుపమ నాలుగు వైవిధ్యమైన రోల్స్ చేసింది. ఇక ఈ ఏడాది ఆమె ఐదో సినిమా కూడా రానుంది. ఆమె హీరోయిన్ గా- చియన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ హీరోగా నటించిన బైసన్ రేపు థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలో సినిమా గురించి పలు విషయాలు అనుపమ షేర్ చేసుకుంది. ఈ నేపథ్యంలోనే విధి గురించి అనుపమ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఈ సినిమా డైరెక్టర్ మారి సెల్వరాజ్ తో గతంలో పెరియేరుమ్ పేరుమాల్ అనే తమిళ సినిమా మిస్ చేసుకుంది. దీంతో అనుపమ కొన్నేళ్లుగా నిరాశ చెందింది. ఆయనతో పని చేసే అవకాశం మళ్లీ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసిందట. అలా కొన్నేళ్లకు మళ్లీ అదే డైరెక్టర్ తో బైసన్ లో నటించే ఛాన్స్ దక్కించుకుంది. ఈ విషయం గురించి మాట్లాడుతూ.. నేను ప్రేమమ్ చేసినప్పుడు, నాకు సినిమా గురించి ఏమీ తెలియదు. ప్రతిదీ కొత్తగా, ఏదో మాయాజాలంగా అనిపించింది. ఇప్పుడు పదేళ్ల తర్వాత, బైసన్ ఫొటో షూట్ సమయంలో నేను మళ్లీ అలాగే ఫీల్ అయ్యాను. అని అనుపమ చెప్పింది. అని తన పదేళ్ల కెరీర్ ను సింపుల్ గా వివరించింది. కాగా, ఇప్పుడు ఆమె కొత్త సినిమా బైసన్ విడుదలకు రెడీ అయ్యింది. రేపే థియేటర్లలోకి వస్తున్నా.. అనుమలో ఎలాంటి ఆందోళన, భయం కనిపించడం లేదు. ఆమె ప్రశాంతంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అతిగా ఆలోచించడం లేదు. ఫలితం ఏదైనా స్వీకరించడానికి రెడీ అన్నట్లు కనిపించింది. ఆ క్రంలోనే విధి తనను ఊహకు మించి ఉన్నత శిఖరాల్లోకి తీసుకెళ్లిందని చెప్పింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Nagendla venkateswarlu, Door no:7-1-107, station road, Narasaraopet, Palnadu District Andhrapradesh- 522601 Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2292, editorpenpower@gmail.com